www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 ఏప్రిల్ 2023

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

6లో

శనివారం పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా జిల్లాలోని మసీదులు, దర్గాలు, ఈద్గాలు ముస్లిము సోదరులతో నిండిపోయాయి. వాల్మీకిపురంలోని ఈద్గాలో ఈదుల్ ఫితర్ నమాజ్ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అకాల వర్షం..అపార నష్టం

పాటూరు పంచాయతీలో నేలకొరిగిన వరి పంట

ఈదురు గాలులతో దెబ్బతిన్న పంటలు
నేలవాలిన ఉద్యాన పంటలు
మామిడి, అరటి, బొప్పాయి, వరికి దెబ్బ

ప్రజాశక్తి-రాయచోటి/నందలూరు

జిల్లాలో అకాల వర్షం ధాటికి భారీ నష్టం వాటిల్లింది. వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల ఫలితంగా శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడినా గాలివానతో జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో ఉద్యాన, వ్యవసాయ పంటలు నేలకొరిగాయి. తీవ్రమైన గాలులతో మామిడి, అరటి, బొప్పాయి, వరి, గోధుమ, మిర్చి, మునగ, టమోటా, బొప్పాయి, మొదలగు పంటలు నేలపాలయ్యాయి. అరటి తీవ్రమైన ఈదురు గాలుల వలన పంటలు చేతికి అందివచ్చిన పంటలు నేల పాలయ్యాయి. జిల్లాలోని రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి, రాయచోటి, తదితర మండలాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షానికి నందలూరు మండలంలోని పాటూరు, నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలతోపాటు మండలంలోని వివిధ ప్రాంతాలలో దాదాపు వందల ఎకరాలలో వరి పంట చేతికి వచ్చే సమయంలో నేలకొరిగింది. రైతులు లబోదిబోమంటున్నారు. ఎకరాకు దాదాపు రూ.65 వేలు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాటూరుతో పాటు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో దాదాపు వందల ఎకరాలలో మామిడి తోటలో మామిడికాయలు రాలిపోయాయి. చెట్లు నేలకొరిగాయి. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు తమకు జరిగిన నష్టాన్ని ఎలా తీర్చు కోవాలో అర్థం కావడం లేదని అన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరిగాయి.

దెబ్బతిన్న పంటల వివరాలు

జిల్లాలో ఈదురుగాలల ప్రభావంతో ఉద్యానవన పంటలైన అరటి 244 హెక్టార్లు కాగా 259 మంది రైతులకు రూ.591.96 లక్షలు నష్టం వాటిల్లింది. రాజంపేట మండలంలో అరటి 135.6 హెక్టార్లలో 143 మంది రైతులకు రూ.339 లక్షలు నష్టం, గోధుమ 20 హెక్టార్లు ఒక రైతుకు రూ.96 వేలు, పుల్లంపేట మండలంలో అరటి 105.2 హెక్టార్లలో 1013 మంది రైతులకు రూ.247 లక్షలు నష్టం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రాజంపేట మండలంలో 5 ఎకరాలు, నందలూరు మండలంలో ఈదురుగాలులకు 5 ఎకరాలు వరి నేలకు ఒరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

కాయలన్నీ రాలిపోయాయి

ఆరుగాలం కష్టపడి పంటించుకున్న మామిడి చేతికి అంది వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యంతో చెట్లు నేలకొరిగాయి. కాయలన్నీ రాలిపోయాయి. తీవ్ర నష్టం ఏర్పడింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- వెంకటయ్య, మామిడి రైతు, కుమ్మరపల్లి, నందలూరు.

చేతికొచ్చిన వరి పంట నీటి పాలు

ఇంటిల్లిపాదితోపాటు, మనుషులను పెట్టుకొని పండించుకున్న వరి పంట అకాల వర్షానికి నేలకొరిగింది. త్వరలో కోత కోయాల్సి ఉంది. పంట చేతికొస్తే తమ కష్టాలు తీరుతాయని అనుకుంటే మరింత ఎక్కువయ్యాయి. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- వల్లూరి పెంచలయ్య, వరి రైతు, కుమ్మరపల్లి, నందలూరు.

నేలరాలిన మామిడి కాయలు

పకడ్బందీగా 'పది' ముల్యాంకనం

- ఎస్ఎస్‌సి పరీక్షల పరిశీలకులు ఎం.వెంకటకృష్ణారెడ్డి

ఎస్ఎస్‌సి పరీక్షల పరిశీలకులు వెంకటకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

ప్రజాశక్తి రాయచోటి

పదవ తరగతి మూల్యాంకనాన్ని పూర్తిస్థాయి భద్రతా ఏర్పాట్ల మధ్య పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పరీక్షల పరిశీలకులు మార్తాల వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. మూల్యాంకన కేంద్రంలో జవాబు పత్రాలను మూల్యాంకనం చేసే తీరును పరిశీలించారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా నిర్వహించాలని డిఇఒ పురుషోత్తమ్‌కు సూచించారు. పదో తరగతి పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేందుకు వచ్చే సిబ్బందికి వేసవి కారణంగా అసౌకర్యం కలగకుండా తీసుకున్న చర్యలను, వసతులను పర్యవేక్షించారు. ప్రతి గదికీ ఫ్యాన్లు, లైట్లు ఉండేలా చూడాలన్నారు. తాగునీరును అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి ఇక్కట్లు లేకుండా స్పాట్ కొనసాగేందుకు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈనెల 19 నుంచి ప్రారంభమైన మూల్యాంకనం 26 నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. స్పాట్ వాల్యుయేషన్ కేంద్రానికి ప్రతీ ఉపాధ్యాయుడూ విధిగా గుర్తింపు కార్డు (ఐడీకార్డు)తో రావాలని, మాస్క్ ధరించాలని, ఎవరు కూడా సెల్‌ఫోన్లు వినియోగించరాదని ఆదేశాలు జారీ చేశారు. సమిష్టి కృషితో మూల్యాంకనాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ ప్రసాద్ బాబు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ క్రిష్టప్ప, పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ శ్రీనివాసరాజు, జిల్లా స్పాట్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రాళ్ల దాడి వైసిపి పిరికిపంద చర్య

ప్రజాశక్తి - రాయచోటి

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పర్యటిస్తున్న క్రమంలో ఒక్కసారిగా చంద్రబాబు కాన్వాయ్‌పై సాక్షాత్తు రాష్ట్ర మంత్రి సమక్షంలోనే రాళ్ల దాడి చేయడం పిరికిపంద చర్య అని టిడిపి బిసి సాధికార సమితి పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసుల నిరంకుశ వైఫల్యంతో చంద్రబాబు భద్రత విషయంలో ఆందోళన వ్యక్తం అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం చేతగాక, ప్రతిపక్ష నాయకులపై దాడులకు ఎగబడడం సిగ్గుచేటన్నారు. **రాజంపేట అర్బన్ :** చంద్రబాబు కాన్వాయ్‌పై సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి సమక్షంలోనే రాళ్ల దాడి చేయడం పిరికిపంద చర్య అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పోలీసుల నిరంకుశత్వం, వైఫల్యంతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం చేతగాక, ప్రతిపక్ష నాయకులపై దాడులకు ఎగబడడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా ఇలాంటి చర్యలు మానుకోకపోతే భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేస్తాం : ఎఎస్ఐ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలో రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్ఐ కృష్ణమూర్తి అన్నారు. అన్నమయ్య జిల్లా విఆర్ నుంచి శనివారం వాల్మీకిపురం పోలీస్ స్టేషన్‌లో శనివారం అదనపు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మండలంలో గుట్టుచప్పుడు కాకుండా గుట్కా, హాన్స్, నాటుసారా, కర్ణాటక మద్యం వంటి నిషేధిత వస్తువులు అమ్ముతున్నట్లు సమాచారం ఉందన్నారు. మండలంలో అనుమతులు లేకుండా చీటీలు నడుపుతూ మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

బిజెపిని సాగనంపుదాం

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరిలో నాయకులు

లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాని సాగనం పుదామని సిపిఎం, సిపిఐ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మురళి పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక శ్రామిక వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిని రాజకీయ ప్రచార భేరి శనివారం తొమ్మిదో రోజు సాగింది. ఈ సందర్భంగా స్థానిక వారపు సంతలో కరపత్రాలు పంచుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. విఐ లెనిన్ 153వ జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్క్సిస్టు మేధావి రష్యా విప్లవ యోధుడు కార్మిక వర్గ స్థాపనను సుసాధ్యం చేసిన కమ్యునిస్టు యోధుడు లెనిన్ అని పేర్కొన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్ విధానాలను అవలంబిస్తుందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ ముసుగులో తమ అనుచరుల చేతికి అప్పగిస్తున్నారని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ చేతున్నారని, అందుకు జగన్ కూడా అంతర్గతంగా అనుకులమేనన్నారు. మదనపల్లి వారపు సంతలో చిరు వ్యాపారస్తుల వద్ద గేటు వసువులు చేసే కాంట్రాక్టర్ వందల రూపాయలు గేటు నిర్బంధంగా వసువులు చేస్తున్నారని పేర్కొన్నారు. వారపు సంతలో మునిసిపల్ నిబంధనలకు విరుద్ధంగా పర్మినెంట్ సెడ్లును నిర్మించారని, అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్న వారికి అధికారులు పాలకులు పూర్తిగా అండగా ఉన్నారని పేర్కొన్నారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 వ తేదీన మదనపల్లి పట్టణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న కార్మికులు, కర్షకులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగ యువకులు పెద్ద ఎత్తున ఈ సభలో పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దేవా, తిరు మల, రవి, నవీన్, శోభ, రమణ, అశోక్, కెకె వెంకటేష్ పాల్గొన్నారు.

రసాయనాల్లేని వ్యవసాయమే లక్ష్యం

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ

అయ్యవారిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రసాయనాలు లేని వ్యవసాయమే మన ధ్యేయమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. శనివారం మండలంలోని అయ్యవారిపల్లిలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మాధవరంపల్లిలో సర్పంచ్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై ర్యాలీ నిర్వహించి, ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు 30 రకాల విత్తనాలను విత్తన గుళికలు చేసి వేసుకోవాలన్నారు. ఏక పంట వద్ద.. అంతర్ పంటలు ముద్దు అని, ప్రకృతి సేద్యం.. పుడమి తల్లికి నైవేద్యం, రసాయనాలు వద్దు..కషాయాలు ముద్దు, వేపతల్లి కల్పవల్లి అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎల్2 స్వాతి, ప్రకృతి సిబ్బంది శ్రీనివాసులు, పెద్ద రెడ్డెయ్య, స్వాతి, హేమలత, అనురాధ, హరినాథ రెడ్డి, సావిత్రి, భాస్కర్ రెడ్డి, అరుణ్ కుమార్, నరేంద్ర రెడ్డి, వినోద్, మాధవి, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

నిర్ధేశమేదీ? ప్రజా'దృష్టి'

తెలుగుదేశం పార్టీ జోన్-5 సమీక్షా సమావేశంలో స్పష్టత కొరవడింది. రాయలసీమలోని ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని 35 అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన నియోజకవర్గ, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలతో కూడిన సమావేశంలో అన్నింట్లో గెలవాలనే దిశను చూపించిన మాట వాస్తవమే. కానీ నిర్దేశమే కొరవడిందని చెప్ప వచ్చు. 35 అసెంబ్లీ ఇన్‌ఛార్జిల్లో బాగా పనిచేసిన ముగ్గురిని ఎంపిక చేసి వారి అనుభవాలను వివరించడం వరకు బాగానే ఉంది. క్షేత్ర స్థాయిలో చురుకుగా పనిచేయని, పనిచేయలేని వారికి అవసరమైన చేయూతను అందించడం గురించి ప్రస్తావించి ఉండాల్సి ఉంది. అధికార వైసిపి శ్రేణుల దాడిని తట్టుకుని క్షేత్రస్థాయిలో పనిచేయడం సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో వారి పరిమితులను అర్థం చేసు కోకుండా, పనిచేసిన వారికి దగ్గరగా ఉంటానని, పని చేయనివారిని గుర్తించబోమని చెప్పడం విచిత్రంగానే ఉంటోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో చురుకుగా పని చేసిన సుమారు 62 మంది టిడిపి కార్యకర్తలపై భౌతికదాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. బాధిత కార్యకర్తలకు ఆర్థిక, న్యాయపరమైన సహాయాన్ని అందిస్తామని టిడిపి జాతీయ అధ్యక్షుని స్థాయిలో కడపలో ఓ ఫంక్షన్ హాలులో నిర్వమించిన సమావేశంలో ఇచ్చిన హామీలు అమలు కాని నేపథ్యంలో కార్యకర్తల మానసిక పరిస్థితేమిటో ఆలోచించుకోవాలి. జాతీయ అధ్యక్షుని స్థాయిలో ఇచ్చిన హామీలు అమలుకు నోచని పరిస్థితుల్లో కింది స్థాయి బూత్ లెవల్ ఇన్‌ఛార్జిల పరిస్థితేమిటో ఆలోచించుకోవాలి. ఇటువంటి పరిస్థితుల్లో అధికార వైసిపి శ్రేణులను తట్టుకుని బూత్ లెవల్‌లో పోరాటం చేయడమంటే మాటలు కాదని గమనించాలి. ముందుగా టిడిపి జాతీయ నాయకత్వం ఇచ్చిన హామీలను అమలు పరిచిన అనంతరం బూత్‌లెవెల్ ఇన్‌ఛార్జిలకు అవసరమైన మనోధైర్యాన్ని ఇచ్చే ప్రయత్నం చేయాలి. ముఠా రాజకీయాలను ప్రజాస్వామ్య పద్ధతులతో ఎదురించిన మాజీమంత్రి బిజీవేముల వీరారెడ్డిని స్ఫూర్తిని తీసుకోవాలనడం వరకు బాగానే ఉంది. మారిన రాజకీయ వాతావరణంలో బరితెగించిన రాజకీయం నడుస్తున్న నేపథ్యంలో అన్ని చోట్లా అమలు చేయడం కత్తి మీద సామును తలపిస్తోందని చెప్పవచ్చు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు టిడిపి అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్ల వరకు ప్రతీకారమే నడుస్తుందని పేర్కొనడం శోచనీయం. అలా చేయడం వల్ల ప్రజలకు మీరిచ్చే సందేశమేమిటో ఆలోచించు కోవాలి. కంటికి కన్ను, ప్రాణానికి ప్రాణం అనే రాజరికం తరహాలో శిక్షణ విధించడం వంటిదని గమనించాలి. దీనివల్ల ఒరిగేమీ లేక పోగా భవిష్యత్ రాజకీయం కలుషితమవు తుందని చెప్పవచ్చు. కార్యకర్తలకు ఆర్థిక పరమైన భద్రతను కల్పించి ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సమున్నతులుగా నిలిచేందుకు అవసరమైన సహాయాన్ని అందించాలి. అప్పుడే క్షేత్రస్థాయి కార్యకర్తలు పట్టుగొమ్మగా నిలిచే అవకాశం ఉంది. ఫలితంగా ఎటువంటి కష్టనష్టాలైన ఎదుర్కొని నిలబడే పరిణితి, సామర్థ్యం అలవడతాయనే సంగతిని గమనించాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు. అటువంటి పనులు చేయకుండా ఎన్నికల్లో గెలిచిన వెంటనే పదవులు అనుభవిస్తూ, కార్యకర్తలను గాలికి వదిలేసినప్పుడే పార్టీ పరిస్థితి దిగజారిపోతుందని గమనించాలని గత ఫలితాలు రుజువు చేస్తున్న సత్యాన్ని గ్రహించాల్సి ఉంది.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి

మహాభారత యజ్ఞ కథలు శ్రేయస్కరం

ప్రజాశక్తి - గాలివీడు

వేసవిలో ప్రజలు, వృద్ధులు, మహిళలు అందరూ పంచమ వేద మహాభారత యజ్ఞాన్ని వినడం ఎంతో శ్రేయస్కరమని మండల వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం దగ్గర మహాభారత యజ్ఞాన్ని లాంఛనంగా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్టస్థాయి అవార్డు గ్రహీత ఎన్. వాణిశ్రీ పంచమ వేద మహాభారత కథలను వినసొంపుగా చెబుతుందన్నారు. ఆమె గాత్రానికి అందరూ మంత్రముగ్దులై భక్తి పారవశ్యంలో మునిగిపోతా రన్నారు. గత ఏడాది కూడా ఇక్కడే గోరాన్‌చెర్వు ఎంపిటిసి గాలి శ్రీనివాసులు, పెద్దరాజా గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో బత్తులరెడ్డి, పెద్దరాజా, నాగభూషణం, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రజాశక్తి-కలికిరి

నేషనల్ సర్వీస్ స్కీమ్ ప్రత్యేకమైన క్యాంపు విజయవంతంగా ముగిసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సరిత తెలిపారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ టు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.సరిత ఆధ్వర్యంలో గండబోయినపల్లి పరిసర ప్రాంతాలైన కొత్త కురవపల్లి, ఇట్లంవారిపల్లెలలో ఎన్ఎస్ఎస్ క్యాంపు వారం రోజులు నిర్వహించారు. మొదటి రోజు జడ్‌పి హైస్కూల్లో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, రెండు, మూడవ రోజులలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా గండబోయినపల్లి, ఇట్లంవారిపల్లెలలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. నాలుగవ రోజున హెల్త్ క్యాంపులో భాగంగా డాక్టర్ శివయోగి సోమశేఖర్ సమక్షంలో ఆరోగ్య శిబిరాలను కొత్తకొరవపల్లి, గండబోయిన పల్లెలలో ఏర్పాటుచేసి అక్కడి ప్రజలకు హిమోగ్లోబిన్, షుగర్‌కు రక్త పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి రాయచోటి

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో జీవశాస్త్రం, భౌతిక రసాయనక శాస్త్రం పరీక్షలను వేరువేరుగా నిర్వహించి విద్యార్థులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని కడప పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకట కృష్ణారెడ్డిని అన్నమయ్య జిల్లా సైన్స్ ఉపాధ్యాయులు కోరారు. ఈ విద్యా సంవత్సరం రెండు పరీక్షలను కలిపి ఒకే పరీక్షగా నిర్వహించడం వల్ల జీవశాస్త్రం జవాబులు భౌతిక రసాయన శాస్త్రం లోను, భౌతిక రసాయన శాస్త్రం జవాబులను జీవశాస్త్రం లోనూ రాయడం జరిగిందన్నారు. పైగా జవాబు పత్రాలు సైతం పొరపాటును మారిపోయాయని తెలిపారు. వీటిని ఉపాధ్యాయులు సరైన స్థానంలోనికి చేర్చడానికి కొంత సమయం వెచ్చించాల్సి వస్తోంది అన్నారు. గతంలో జీవశాస్త్రం, భౌతిక రసాయనిక శాస్త్రాలకు వేరువేరు పరీక్షలు నిర్వహించే వారని అప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని అన్నారు. కాబట్టి పదవ తరగతి సైన్స్ పరీక్షను వేరువేరుగా నిర్వహించవలసిందిగా జిల్లా సైన్స్ ఉపాధ్యాయుల తరపున జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, భౌతిక రసాయన శాస్త్రం ఫోరం అధ్యక్షులు భాస్కరన్, సీనియర్ ఉపాధ్యాయులు, పురుషోత్తం రెడ్డి, రామలింగరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, సైన్స్ కన్వీనర్ రవీంద్రారెడ్డి, పల్లం రామచంద్ర, చంద్రశేఖర్, శ్రీనాద్ రెడ్డి విజ్ఞాపన పత్రం అందించారు.

సిరులిచ్చే చిరుధాన్యాలు

- సాగుపై రైతుల ఆసక్తి
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు
- రబీలో 1,520 ఎకరాల్లో సాగు
- ఖరీఫ్‌లో 3500 ఎకరాల సాగుకు సన్నాహాలు

రాయచోటి ప్రాంతంలో సాగు చేసిన కొర్ర పంట

ప్రజాశక్తి-రాయచోటి

మనుషుల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. చిరుధాన్యాల విలువేంటో సమాజానికి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. కొర్రాల పాయసం, రాగి జావ లాంటి పేర్లు జనాల నాలుకల మీద తిరుగుతున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటకు సార్థకత చేకూరుతోంది. గటకే తిన్నామో.. గంజే తాగామో.. అని మాట వరుసకు అంటుంటాం. పేదతిండి అని చెప్పడానికి వాడే ఉపమానం అది. నిజానికది గరీబు తిండి కాదు. నిఖార్సయిన తిండి. నిండైన తిండి. గంభీరమైన తిండి. శ్రీమంతుల తిండి. ఇంకా చెప్పాలంటే– చిరుధాన్యాలకు మించిన పౌష్టికాహారం– ఈ భూమండలం మీదనే లేదు. అందుకే ఒకప్పటి పచ్చజొన్నల గట్క మళ్లీ రారమ్మని పిలుస్తోంది. ఆనాటి రాగిజావ తిరిగి కళ్లముందు కదలాడుతోంది. కనుమరుగైన సామపాశం మళ్లీ సాహో అంటోంది. మచ్చుకైనా కనిపించని సజ్జ మలీదలు మిర్రిమిర్రి చూస్తున్నాయి. ఈ తరానికే తెలియని నూనె పోలెలు నున్నగా కవ్విస్తున్నాయి. ప్రాభవం కోల్పోయిన చిరుధాన్యాలు చిరునవ్వులు రువ్వుతున్నాయి. సన్నబియ్యం, బాసుమతి రైస్ తినడమే స్టేటస్ అనుకునే రోజులు పోతున్నాయి. దంపుడు బియ్యం ఎంత రేటున్నా సరే కొంటున్నారు. రాగి అంబలి తాగడానికి క్యూ కడుతున్నారు. ఎండాకాలం సామబియ్యం తింటే చలువ అని జనానికి అర్థమైంది. చలికాలం కొర్రబువ్వ తినాలని ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది.

చిరుధాన్యాల సాగుతో రైతు ఇంట సిరులు కురువనున్నాయి. జిల్లాలోని నేలలు కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, అరికెలు, ఊదల పంటల సాగుకు అనుకూలం కావడంతో రబీలో 1,520 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 3,500 ఎకరాల్లో సాగు చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అతి తక్కువ వర్షపాతం నమోదైనా పంట చేతికొస్తుంది. జిల్లాలో చిరుధాన్యాల సాగుపై అధిక శాతం రైతులు ఆసక్తిని చూపుతున్నారు. ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెడితే 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో రూ.60 నుంచి రూ.70 వరకు ధర పలుకుతుండగా, క్వింటాలుకు రూ.6వేల నుంచి రూ.7 వేల వరకు వస్తుంది. ఎకరాకు దాదాపు రూ.70 వేలకుపైగా ఆదాయం సమకూరనున్నది. రైతుల్లో అవగాహన పెంచి జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెంచేలా వ్యవసాయ శాఖ కృషి చేస్తున్నది.

కొర్రకు మంచి గిరాకీ ఉంది

కొర్రలకు మంచి గిరాకీ ఉండటంతో 20 గుంటల పొలంలో చేశాను. ఇతర పంటల కన్నా చిరుధాన్యాల సాగులో మంచి లాభాలున్నాయి. పంట కంకి దశకు చేరుకుంటుంది. మార్కెట్‌లో కిలో కొర్రలు రూ.80–90 అడుగుతున్నారు. తక్కువ పెట్టుబడి, శ్రమ కూడా తక్కువగానే ఉంటుంది. పంట దిగుబడి బాగా ఉంటే మంచి లాభాలే వస్తాయి.

- రామిరెడ్డి, రైతు, చెన్నముక్కపల్లి, రాయచోటి.

3,500 ఎకరాలకు సాగు పెంపు

జిల్లా వ్యాప్తంగా సుమారు 1520 ఎకరాల్లో పలు రకాల ధాన్యాలు సాగు చేస్తున్నారు. రాగులు, జొన్న, సజ్జలు, కొర్రలు పండిస్తున్నారు. మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం లభిస్తున్నది. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించి జిల్లాలో ఈ ధాన్యాల సాగు విస్తీర్ణం 3500 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.

- ఉమామహేశ్వరమ్మ, జెడి, అన్నమయ్య.

పెట్టుబడి తక్కువ...దిగుబడి ఎక్కువ

చిరుధాన్యాల సాగుకు పెట్టుబడి తక్కువ. దిగుబడి ఎక్కువగా ఉంటుంది. తృణధాన్యాల సాగు తక్కువ పెట్టుబడితో చేపట్టవచ్చు. తక్కువ నీటి వినియోగంతో ఈ పంటలు పండుతాయి. పంటల సాగులో ఎప్పటికప్పుడూ రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నాం. వరి, మక్కజొన్న, కూరగాయల పంటల కన్నా చిరుధాన్యాల సాగులోనే మంచి దిగుబడులు, లాభాలు పొందవచ్చు.

- గిరీష, కలెక్టర్, అన్నమయ్య.

అంగన్వాడీ కేంద్రం ఎదురుగా ముళ్ల పొదల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోతే ఎలా?

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ డిఎంసి రోడ్డులో అంగన్వాడీ కేంద్రం ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేకపోవడంతో పిల్లలకు ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అంగన్వాడీలో మొత్తం 15 మంది విద్యార్థులు ఉన్నారు. అంగన్వాడీ సెంటర్‌కు నీటి వసతి, మరుగుదొడ్లు లేక చిన్నారులు పలు రకాల ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ కేంద్రానికి ముందు కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయాందోళనలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో కొందరు బహిరంగ మలవిసర్జన చేయడంతో దుర్వాసనతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని అంగన్వాడీ టీచర్ విజయ తెలిపారు. ప్రతివారం మెయింటెనెన్స్ పేరుతో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్న సంబంధిత అధికారులు, ట్రాన్స్‌ఫార్మర్ ముందు చిన్నచిన్న మొక్కలు, ముళ్ళ పొదలు కనపడలేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని తల్లి దండ్రులు కోరుతున్నారు.

శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-కలికిరి

చిరుధాన్యాలతో శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు.కెవికె నందు చిరుధాన్యాల విలువఆదారిత ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమం కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 25 నుంచి మే 1 వరకు చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు, వాటి పోషక విలువలు అనే అంశం మీద వారం రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రకాలైన చిరుధాన్యాల పోషకాల ప్రాముఖ్యత, వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై వృత్తి నైపుణ శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆసక్తి కలిగిన మహిళలు, పురుషులు కూడా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8520887745 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైసిపి కార్యకర్త మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిపురం గ్రామ పంచాయతీ ఫత్తేపురంకు చెందిన వైసిపి కార్యకర్త నరసింహారెడ్డి(79) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఫత్తేపురంలోని మృతుడి స్వగృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు పురుషోత్తం రెడ్డిని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట చింతల ఆనందరెడ్డి, కేశవరెడ్డి, రవిచందర్, నరసింహులు, మదనమోహన్‌రెడ్డి, మునిభాస్కర్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

జోరుగా పవనన్న ప్రజాబాట

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పవనన్న ప్రజాబాటలో జనసేన నాయకులు

పవనన్న ప్రజాబాట కార్యక్రమం గత 85 రోజులుగా నియోజక వర్గంలో జోరుగా కొనసాగుతోంది. జనసేన రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ ఆదేశాల మేరకు పవనన్న ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా పులపత్తూరు పంచాయతీ లోని నూతిపల్లి, చింతల కోన, బగిడిపల్లి, ఏకిరిపల్లి తదితర గ్రామాలలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజలకు వివ రించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు భాస్కర్ పంతులు, పోలిశెట్టి శ్రీనివాసులు, వీరయ్య ఆచారి, గోపి, వీర మహిళలు జెడ్డాశిరీష, మాధవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ హబీబ్ బాషా

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణ ప్రజలకు ఈ ఏడాది వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాషా తెలిపారు. శనివారం పట్టణ శివారులోని తిరుపతి రోడ్డులోని నూనె విత్తుల కర్మాగారం సమీపంలోని తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. తాగునీటి సమస్య ఎక్కడ ఏర్పడినా యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంట పంచాయతీ నీటి సరఫరా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇంత వరకు మెగా డిఎస్‌సిని విడుదల చేయలేదని, జాబ్ క్యాలెండర్ ఊసేలేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలి పారు. స్థానిక ఆర్ అండ్‌బి అతిథిగృహంలో శనివారం ఆయన విలే కరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయ డంలో పూర్తిగా విఫలమైం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తోందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే దాదాపు లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. తద్వారా వలసలు ఆగిపోతాయని తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, నాగరాజు పాల్గొన్నారు.

వైసిపి అరాచకం సిగ్గు చేటు

ప్రజాశక్తి - చాపాడు

యర్రగొండపాలెంలో వైసిపి అరాచకం సిగ్గు చేటని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్ ఖండించారు. ఆ మేరకు శనివారం ఆయన టిడిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా యర్ర గొండపాలెంలో పర్య టిస్తున్న చంద్రబాబు కాన్వాయ్‌పై మంత్రి ఆది మూలపు సురేష్ దగ్గరుండి వైసిపి రౌడీ మూకలచే రాళ్ల దాడి చేయించడం అరాచక మన్నారు. బాధ్యతాయుత పదవిలో ఉండి మంత్రి సురేష్ బట్టలు విప్పి వీధిరౌడీలా సవాలు చేయడం దేనికి సంకేతమని రాష్ట్ర ప్రజలు అందరూ గమనించాలని ఆయన కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని ఆరోపించారు. దాడి చేసిన వైసిపి గూండాలు, రౌడీ మూకలను వదిలేసి, టిడిపి శ్రేణులపై లాఠీఛార్జీ చేయడం దుర్మార్గమని తప్పు పట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి గురప్ప, టిడిపి జిల్లా కార్యదర్శి సిద్దయ్య, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ అల్తాఫ్, బుర్రి నాగరాజు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పెద్దమండ్యం : సాముహిక ప్రార్థనలో ముస్లిం సోదరులు

ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నా పెద్దా అందరూ కొత్త బట్టలు ధరించి ఉత్సాహంగా మసీదులకు చేరుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక నిమ్మనపల్లె బస్టాండ్, బండమకాన్‌వీధుల్లోని మసీదుల్లో, హసన్‌ఖాన్‌వీధిలోని దర్గా, బైపాస్ రోడ్డు, నమాజ్‌కట్టవీధుల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక రంజాన్ అని, ప్రతి ఒక్కరూ కుల, మతాలకు అతీతంగా ఎదుటి వారిని ప్రేమిస్తూ, పరోపకార గుణాన్ని అలవర్చుకొని అల్లా చూపిన సన్మార్గంలో నడుచుకోవాలని ఉద్బోధించారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ వేడుకలను నిర్వహించుకున్నారు.గత 30 రోజులుగా కఠిన ఉపవాసాలు ఉండి రంజాన్ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం జరిగింది. మండలంలో కోన, పాపిరెడ్డిగారిపల్లి, ఎర్రకోటపల్లి, నడిమిచర్ల, బంగారువాండ్లపల్లి, ఎర్రయ్యగారిపల్లి, గ్రామాలలో ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. **వీరబల్లి :** రంజాన్ పండుగను మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కొత్త వస్త్రాలు ధరించి ఉదయం నుంచి మసీదులు, దర్గాల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.మండలంలోని అన్ని మసీదులు ముస్లింలతో కళకళలాడాయి. ఒకరినొకరు ఆ లింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **పీలేరు :** పీలేరులో ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లీం సోదరులు స్థానిక జెండామాను దగ్గరకు చేరుకుని, అక్కడి నుంచి సామూహిక ప్రార్థనలుచేశారు. ముస్లీంలు తాము చేసుకునే పండుగల్లో అతి ముఖ్యమైన పండుగ ఈద్ -ఉల్-ఫితర్ ఒకటని, రంజాన్ పండుగ ప్రార్థనల అనంతరం వారి శక్తి కొలదీ పేదలకు నగదు, వస్త్ర దానాలు చేసుకుంటారన్నారు. సిఐ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ఎన్ఐ నరశింహుడు, ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందో నిర్వహించారు. వాహనాల రాక పోకలను కూడా నియంత్రించి ట్రాఫిక్ సమస్యను నియంత్రించారు. **నిమ్మనపల్లి :** నిమ్మనపల్లిలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని మసీదుల నుంచి ముస్లీం సోదరులు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సామూహిక ప్రార్థనలో మత గురువు మాట్లాడుతూ ప్రజలను ఈతి బాధలు, వేసవి ఎండల నుంచి కాపాడలిని, ప్రజలు, పశు, పక్షాదులు అంతు తెలియని వింత వ్యాధుల బారిని పడకుండా కాపాడాలని, జనాల్లో పరమత సహనాన్ని, సాటి వ్యక్తుల పట్ల ప్రేమానురాగాలని కలిగి ఉండేలా చూడాలని ప్రార్థించి వేడుకున్నారు. ఇన్‌ఛార్జి ఎస్ఐ సుధాకర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రమేష్‌బాబు, నవయుగనాథ్, కానిస్టేబుల్ కేశవ ఇతర పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. **నందలూరు :** మండల వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా రంజాన్ వేడుకలు నిర్వహించుకున్నారు. భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు శుక్రవారంతో పూర్తి చేసుకొని, శనివారం ఉదయం పలు ఈద్గా మైదానాలలో ఈద్-ఉల్-ఫితర్ జరుపున్నారు. వేడుకల్లో జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, నందలూరు ఎంపిటిసి సుభాన్ భాష, టిడిపి నాయకులు మాభాష, గౌస్ బేగ్, పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు, పాల్గొన్నారు. **కలికిరి :** ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని మసీదుల నుంచి ముస్లీం సోదరులు కలికిరి క్రాస్ రోడ్డు లోని జామియా మసీదు వద్దకు చేరుకుని, అక్కడి నుంచి సామూహికంగా అల్లాను స్తుతిస్తూ కొత్తగా నిర్మించిన ఈద్గా మైదానం చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఎస్ఐ లోకేష్ రెడ్డి తన సిబ్బందితో పర్యవేక్షించారు. **బి.కొత్తకోట :** మండలంలో ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పిటియం రోడ్డులోని ఈద్గా వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ ఎస్ఎస్ ఫయాజ్, గుమ్మడికాయల చాంద్ బాషా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అయుబ్ బాషా, డాక్టర్ అరిఫ్, అహ్మద్ బాషా, హైదర్, సాదిక్, సద్దాం, ఖాదర్ బాషా, మున్నిద్, ముబీద్,మియా, పీర్ భాష, కాలేషా, షమీ, షాను, జాఫర్ బై, స్వాతి జిరాక్స్ సెంటర్ చాంద్ బాషా, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, సిపిఐ సలీం, సిపిఐ బషీర్, ఎంపిటిసి సయ్యద్, అల్తాఫ్ పాల్గొన్నారు. **గాలివీడు :** రంజాన్ పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఘనంగా రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ముస్లిం సోదరులు పేదవారికి అన్నదాన కార్యక్రమం, దుస్తులు, నగదు పంపిణీ చేశారు. **రాజంపేట అర్బన్ :** మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగను జరుపుకోవడం హర్షణీయమని నియోజకవర్గ టిడిపి నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని జానీ బాషాపురం మసీద్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని ముస్లిం సోదరులకు ఈద్‌ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఆయన వెంట మత గురువు ఆజామ్, మసీదు కమిటీ సభ్యులు జానీ బాయ్, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మండెం కరీముల్లా, యువ నాయకులు సూర్యనారాయణ రాజు, వీరబల్లి సుధాకర్ రాజు, తెలుగుయువత పట్టణ ప్రధాన కార్యదర్శి సుహేల్, మైనారిటీ నాయకులు హబీబ్ పాల్గొన్నారు. **పెద్దమండ్యం:** మండలంలో శనివారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. పెద్దమండ్యం, కలిచెర్ల, సిద్దవరం, తురకపల్లి, వెలిగల్లు, శివపురం, ముసలీకుంట, బండ్రేవు, పాపేపల్లి తదితర గ్రామాల్లో మసీదులో గత నెల రోజులుగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులు మత ప్రబోదకుడు వెంట ఈద్గా వద్దకు మంగళ వాయిద్యాలు తో మూకు మ్మడిగా దైవ ప్రార్థనలు చేసుకుంటూ అక్కడికి చేరుకున్నారు. ఈ సంవత్సరం రెండు జమాత్‌లు ఒక్కటై అందురూ కలిసి ఒకే ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు.**తంబళ్లపల్లి :** మండల కేంద్రంలో శనివారం ముస్లిం సోదరులు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మసీదు నుంచి ఊరేగింపుగా అల్లాను ప్రార్థిస్తూ ఈద్ ఘవత్ సిద్దారెడ్డి గారిపల్లి క్రాస్ లోని ఈద్ ఘవత్ వద్దకు చేరుకున్నారు. మత గురువు యూసఫ్ మహా ప్రవక్త గురించి వివరించారు.

ఆలింగనం చేసుకుంటున్న చిన్నారులు

పీలేరు : సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

అప్రమత్తతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని డిఎస్‌పి కె.కేశప్ప పేర్కొన్నారు. శనివారం స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి ఆర్.గంగాధర్ ఆదేశాల మేరకు పట్టణంలోని లాడ్జిల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. మారుతున్న కాలానుగుణంగా నేరస్తులు పలు రకాలుగా నేరాలు చేస్తూ నకిలీ అడ్రస్‌ప్రూఫ్‌తో లాడ్జిలలో షెల్టర్లు తీసుకుంటున్నారని ఎవరికైనా రూములు ఇచ్చే ముందు తప్పనిసరిగా వారి అడ్రస్ ప్రూఫ్ తీసుకోవాలని సూచించారు. ఏదైనా అనుమానం వచ్చిన వెంటనే పోలీస్ అధికారులకు తెలపాలని ఆదేశించారు. లాడ్జిలలో గ్యాంబ్లింగ్ వ్యభిచారం వంటి అసాంఘిక కార్యాకలాపాలు జరుగకుండా లాడ్జిల యజమానులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పట్టణం కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్నందువల్ల నేరాలు చేసినటువంటి నేరస్తులు కొన్ని సందర్భాల్లో షెల్టర్లు తీసుకుంటున్నారని అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తత అవసరమన్నారు. ప్రతి లాడ్జిలోనూ సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పట్టణంలో నేరాల నియంత్రణకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో టూటౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ, తాలూకా సర్కిల్ సిఐ సత్యనారాయణ, రూరల్ సర్కిల్ సిఐ శివాంజనేయులు, ఎస్ఐలు జి చంద్రమోహన్, హరిహర ప్రసాద్, మదనపల్లి పట్టణ లాడ్జిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.సుధాకర్ రెడ్డి, లాడ్జీల యజమానులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలకు కొత్తపేట విద్యార్థులు

పుల్లంపేట : పుల్లంపేట మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న జి.పల్లవి, పి. నాగవేణి, సి.భవిత రెడ్డి శనివారం అనంతపురంలో జరిగిన అండర్-17 టెన్నిస్ బాల్ క్రికెట్‌లో పాల్గొని అద్భుత ప్రతిభ చూపించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ బాలశేఖర్ తెలిపారు. జిల్లాస్థాయిలో అద్భుత ప్రతిభ చూపిన వీరు రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరచాలన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతి ఒక్కరూ రాణించాలని ముఖ్యంగా మహిళలు క్రీడల్లో రాణించడం ఆనందించాల్సిన విషయమన్నారు. పాఠశాల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీస్తూ వారికి అన్ని విధాల శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ బాల శేఖర్ ను ముగ్గురు విద్యార్థినిలను అభినందించారు.

ఎంజెఆర్ విద్యార్థులకు ప్రేరణా తరగతులు

పీలేరు : స్థానిక పట్టణంలోని ఎంజెఆర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రేరణా తరగతులు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో స్టేట్ ప్రెసిడెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ అధినేత డాక్టర్ షీలా లోకనాథన్ విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్ అందించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఎలా ముందడుగు వేయాలనే అంశాలను చర్చించారు. కృషి, పట్టుదల , ఆత్మవిశ్వాసంతో ఎంత కష్టమైన పనినైనా సులువుగా చేయవచ్చని సూచించారు.

90 పరుగులకే కుప్పకూలిన నెల్లూరు జట్టు

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ సీనియర్స్ టి-20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శనివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 90 పరుగులకే కుప్పకూలింది. 8 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజ యం సాధించింది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటిం గుకు దిగిన నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 90 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని సాకేత్ రామ్ 21, పి. మోహన్ కృష్ణ 20 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని వై. గిరీష్ కుమార్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. కె. దీపక్ సాయినాథ్ 2, ఏ. సూర్య 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 91 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 11.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 91 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టు లోని అభిషేక్ ఎం రెడ్డి 41, కే.ఎన్. పృథ్వీరాజ్ 26 (నాట్ అవుట్) పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సాకేత్ రామ్, పి. మహేష్ లు చెరో ఒక్క వికెట్ తీసుకున్నారు. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో జట్టు 6 వికెట్ల తేడాతో కర్నూలు జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎస్. తౌఫిక్ హుస్సేన్ 51 పరుగులు చేశాడు. అనం తపురం జట్టులోని బి.ఎస్. వినయ్ కుమార్ 2, ఎం. దీపక్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతపురం జట్టు 14.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 123 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని పరసోతోపు పంచాయితీ బోయపల్లి గ్రామాల్లో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులందరికీ మహిళా సంఘాల సమావేశాల్లో సభ్యులతో చర్చించి ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు యూనిట్ ఇన్‌ఛార్జి కె.రాజు పేర్కొన్నారు. నవధాన్యాల పంటల సాగుపై రైతులకు వివరించి, వాటి ఉప యోగాలు, నవధాన్యాలు వేయడం వల్ల భూమిలో కార్బన్ శాతం పెరిగి భూమి లో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది భూసారము పెరుగుతుందన్నారు. కార్య క్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి కె.రాజు, లక్ష్మి, లత ఐసిఆర్‌పిఎస్ పాల్గొన్నారు.**గుర్రంకొండ:** మండలంలోని టి.పసలవాండ్లపల్లి నందు శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగింది. మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తంగాల వెంకటజ్యోతి ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతు సంఘాల సభ్యులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, సంఘమిత్రలు, వివో లీడర్లలతో కలిసి ర్యాలీగా ఇంటింటికి వెళ్ళి అవగాహన కల్పించారు. గత సంవత్సరం ఎంత విస్తీర్ణం ప్రకృతి వ్యవసాయం చేశారని ఈ సంవత్సరం ఎంత విస్తీర్ణం ప్రకృతి వ్యవసాయం చేస్తారని ఆరా తీశారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో విత్తన గుళికలు తయారీ పద్ధతిని చేసి చూపించారు. నవధాన్య పద్ధతిలో భూమిలో సాగు చేసి భూసారని పెంచవచ్చునని తెలిపారు. సుమారు 30 రకాల విత్తనాలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసి భూమిలో తెగుళ్ల నివారణ చేపట్ట వచ్చునని వివరించారు. కార్య క్రమంలో ఎన్.రమేష్ రెడ్డి, శ్రీనాథ్, సాయి కుమారి, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గుర్రంకొండ : సజ్జ పంటను పరిశీలిస్తున్న ఆర్‌బికె సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌కు గురైన దుకాణం

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని బెంగళూరు రోడ్డు సంతోష్ మిషన్ పక్కన ఉన్న ఆటోమొబైల్ దుకాణంలో శనివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే ఆయిల్ బాటిల్స్, బ్యాటరీలు తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని దుకాణ యజమాని బావజాన్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవన ఆధారమైన దుకాణం మంటల్లో కాలిపోవడంతో దుకాణ యజమాని బావాజాన్ కన్నీటి పర్యంతమయ్యారు. తమను ప్రభుత్వం,అధికారులు ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై పోలీసులు, సంబంధిత అధికారులు వివరాలు సేకరించి నష్టపరిహారం అంచనా వేస్తామన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్

ధరణిని కాపాడుకుందాం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రస్తుత రోజుల్లో తాగేనీరు, పీల్చేగాలి, నివసించే నేల ఇలా అన్ని కాలుష్యంలో చిక్కుకున్నాయని, పెరిగిపోతున్న భూతాపం వాతావరణ కాలుష్యంతో అల్లాడుతున్న ధరణిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. శనివారం స్థానిక రైల్వేకాలనీ ప్రాంతంలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపరితలంపై ఉన్న వనరులేకాక భూగర్భజలాలు, ఖనిజ వనరులను పలు దేశాలు విచక్షణారహితంగా వాడుకోవడం వల్ల భూతాపం పెరిగి రాబోయే కొన్ని దశాబ్దాలలో ముడిచమురు నిల్వలు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మనం నివసిస్తున్న ప్రాంతాన్ని కాలుష్య రహితంగా, పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉండేలా కృషి చేసి రాబోవు తరాలకు పరిశుభ్రమైన, స్వచ్ఛమైన వాతావరణం అందించడమే ప్రపంచ ధరిత్రీ దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జెవివి సభ్యులు పాల్గొన్నారు.

బిజెపి ఓటమి అనివార్యం

ప్రజాశక్తి - కడప

2024లో నిర్వహిం చబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి ఓటమి తప్పదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ అన్నారు. రాహుల్ గాంధీపై అక్రమ కేసులు బనాయించి బిజెపి చాలా పెద్ద తప్పు చేసిందని అన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డబ్బులు ఇచ్చి ఫేక్ సర్వేలు చేయించుకుని ఇటు ఓటర్లను, అటు ప్రతిపక్ష నాయకులను సందిగ్ధంలో పడేలా చేస్తున్నాయని విమర్శించారు. టైమ్స్ నౌ నవ భారత్ వారు సర్వే నిర్వహించి రాష్ట్రంలో వైసిపికి 24 నుంచి 25 పార్లమెంటు సీట్లు వస్తాయని చెప్పడం చాలా హాస్యాస్పదం అన్నారు. 24 నుంచి 25 కాదు కదా కనీసం 10 సీట్లు కూడా వైసిపికి రావని జోష్యం చెప్పారు. కేంద్రంలో బిజెపికి 292 నుంచి 300 సీట్లు వస్తాయని ప్రజలను మభ్య పెడుతున్నారని వాపో యారు. కేవలం రెండు, మూడు ప్రయివేట్ సంస్థల కోసం మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్లబాబు, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ, ఉపాధ్యక్షుడు నూతి సురేష్, నగర మహిళ అధ్యక్షురాలు లావణ్య , బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయప్ప పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : శిల్పారామంలో రంజాన్ పండుగ సందర్భంగా శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అందరూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయం త్రం మాస్టర్ రాజా, రాజా కళా నిలయం, పులి వెందుల వారి శిష్య బృందంచే జానపదం, వెస్ట్రన్ నృత్యాలు ప్రదర్శిం చారు. కార్య క్రమంలో నృత్య శిక్షకులు రాజా, పరి పాలనా అధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

16 మంది రక్తదానం

కడప అర్బన్ : ప్రాణం విలు వ తెలిసిన 16 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని బ్లడ్ 2 లివ్ వ్యవ స్థాపకులు పట్టుపోగుల పవన్‌కుమార్ అన్నారు. శనివారం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రక్తకొరత అధికంగా ఉంటుందని తెలిపారు. దీన్ని అధిగమించేందుకు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రిమ్స్‌లో అనేకమంది రోగులు సకాలంలో రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్లడ్ 2 లివ్ సభ్యులు తోట కళ్యాణ్, పల్లా జయకృష్ణ, తోట మోహన్ సాయి, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సిస్టర్ రెస్పుల్, టెక్నిషన్స్ జయచంద్రారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అరెస్టయిన పేకాట రాయుళ్లతో పోలీసులు

నలుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం వరకు వివరాలు.. మండలంలోని గుడిబండ పంచాయతీ చౌక్కన్న గారిపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు.ఈ దాడులలో పేకాట ఆడుతున్న శ్రీమన్నారాయణ, బాలాజీ, మధుసూదన్, చంద్రశేఖర్ లను పట్టుకుని వారివద్ద నుంచి రూ.6780 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, కానిస్టేబుల్ సహదేవా, రమణనాయక్, నాగిరెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు.